సమాచారం

నేడు డయల్ యువర్ ఆఫీసర్

హఫీజ్‌పేట్ : మియాపూర్ ఆర్టీసీ డిపో–1 పరిధిలో ప్రయాణికుల సమస్యలపై గురువారం డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో సిటీ బస్సులే కాకుండా దూర ప్రాంతాలకు సంబంధించిన సమస్యలు వివరించడంలో పాటు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 9959226153 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ 11కేవీ, మైహోం 11కేవీ, ఎస్‌బీఐ 11కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సీజేఆర్ స్కూల్, అయ్యప్పసొసైటీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ తదితర ప్రాంతాలలో, మధ్యాహ్నం 2గంటల నుండి 5.30 గంటల వరకు రవీంద్రసొసైటీ, పర్వత్‌నగర్ సిగ్నల్, ఖైత్లాపూర్ బ్రిడ్జి, సాయినగర్, 100 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో.. విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేందర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గుల్‌మొహర్‌పార్కు ప్రాంతం, డాక్టర్స్ కాలనీ, సాత్‌పార్కు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

- నేతాజీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేతాజీనగర్‌లో విద్యుత్ ఉండదన్నారు.

ఐరాజ్ తన్వీర్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థినికి బుధవారం పీహెచ్‌డీ డిగ్రీ ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్(జేఎంసీ)లో పరిశోధక విద్యార్థి మహ్మద్ ఐరాజ్ తన్వీర్‌సిద్ధిఖీ డీన్ ప్రొఫెసర్ ఎహ్తెషామ్ అహ్మద్‌ఖాన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఈ సందర్భంగా 'హైదరాబాద్ నుంచి ప్రచురించబడిన ఉర్దూ, ఆంగ్ల దినపత్రికలలో వార్తల తులనాత్మక విశ్లేషణ' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

కొవిడ్ పరీక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి, రాయదుర్గం యూపీహెచ్‌సీల్లో కొవిడ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్ కేసులు నిల్ అని మెడికల్ ఆఫీసర్ శైలజ తెలిపారు. శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో నలుగురికి, రాయదుర్గం కేంద్రంలో ఇద్దరికి పరీక్షలు చేశారు.

పాజిటివ్ నిల్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కొవిడ్ టెస్టులలో జీరో పాజిటివ్ అని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. బుధవారం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో 25 మందికి పరీక్షలు చేశారు. ముగ్గురికి ఆర్‌టీ పీసీఆర్, 22 మందికి రాపిడ్ టెస్టులు నిర్వహించారు.

హెచ్‌సీయూ విద్యార్థి పేపర్ ప్రజంటేషన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి దక్షిణాఫ్రికాలో పేపర్ ప్రజంటేషన్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతాగోపీనాథ్ ఆధ్వర్యంలో విఠల్‌రాథోడ్ రీసెర్చ్ చేస్తున్నాడు. ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికన్(ఈఏఎస్‌ఏ) వార్షిక కాన్ఫరెన్స్ ఇటీవల సెంచరీసిటీ హోటల్‌లో జరిగింది. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు ప్రసంగించారు. 'బ్లెండెడ్ లెర్నింగ్, ఏ హైబ్రిడ్ ఇన్‌స్ట్రక్షనల్ మోడల్ ఫర్ ఎఫెక్టివ్ లెర్నింగ్' అనే అంశంపై విఠల్‌రాథోడ్ పేపర్ ప్రజంటేషన్ చేశారు.

త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఈనెల 22వ తేదీ వరకు సంగీతోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం పద్మశ్రీ యెల్లా వేంకటేశ్వరరావు కచేరీ నిర్వహించారు. విద్వాన్‌భట్టి పవన్ సింగ్, విద్వాన్ త్యాగరాజుల వయోలిన్ కచేరీ, విదూషి ప్రణతి వైణరుల స్వర కచేరీ, విద్వాన్ కాంతి స్వరూప్ మల్లెల గాత్ర కచేరీతో సందర్శకులను అలరించారు.

దరఖాస్తుల స్వీకరణ

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల బాలానగర్ బాయ్స్–1 హైదర్‌నగర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు.. 7989486898, 7569241410, 7331170802 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'నిర్మాణ్' ఫర్ స్టూడెంట్స్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్న సంస్థ

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో రూపురేఖలు మారిపోతున్నాయి. 'మన ఊరు–మన బడి' పేరిట ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుండగా తామూ చేయూత అందిస్తామని ప్రైవేటు సంస్థలు కూడా ముందుకొస్తున్నాయి. ఆ కోవలోనిదే సేవా భావన కలిగిన సంస్థ 'నిర్మాణ్'. ఈ సంస్థ మొదట లింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసుకుంది. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయుల సంపూర్ణ సహకారంతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఆ ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 300మంది విద్యార్థులు చదువుతున్నారు.



లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న క్లాస్ రూం

'నిర్మాణ్' సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే పనులు ఇవే..

- లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒక క్లాస్ రూమ్, టాయిలెట్స్ (బాలికలు, బాలురకు వేర్వేరుగా) నిర్మించి వాటిని 'మోడల్'గా రూపొందించేలా నిర్ణయించి పనులు చేపట్టారు.
- స్కూల్‌లోని తరగతి గదులు, ఆఫీస్ రూమ్‌లకు ఎలక్ట్రికల్ వైరింగ్, 12 ఫ్యాన్లు, 12 ట్యూబ్ లైట్స్ అమర్చారు.
- ఒక్కో విద్యార్థికి ఆట బొమ్మలు, బ్యాగ్స్, నీళ్ల బాటిల్స్, లైబ్రరీ బుక్స్, జామెటరీ బాక్స్ అందించారు.
- ఇప్పటికే తరగతి గదుల్లో పెయింటింగ్ చేయించే పనులు పూర్తి చేశారు, అవుట్ సైడ్ నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత వేసేలా ప్లాన్ చేశారు.
- పెయింటింగ్ పూర్తయితే స్కూల్ వాల్స్‌పై విద్యాపరమైన అంశాలతో కూడిన వాల్ పెయింటింగ్ వేయాలని, కరిక్యులమ్ రిలేటెడ్ పెయింటింగ్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

ఇతర పాఠశాలల్లో కూడా...

- శేరిలింగంపల్లిలోని మరో మూడు స్కూళ్లలో కూడా 'నిర్మాణ్' సంస్థ సహకారంతో మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయి.
- లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుతో పాటు వారికి శిక్షణ ఇచ్చేందుకు ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు.
- మధురానగర్ ప్రాథమిక పాఠశాలకు ముగ్గురు వలంటీర్లను నియమించడంతో పాటు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందజేస్తున్నారు.
- రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్ట్రక్టర్ నియామకం.
- చందానాయక్ స్కూల్‌లో ఇద్దరు టీచర్ల నియామకం, మోడల్ టాయిలెట్స్ నిర్మాణం, గ్రౌండ్ లెవల్, స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత, బిల్డింగ్ ఆకట్టుకునేలా పెయింటింగ్ చేయించడం, ఎడ్యుకేషనల్ వాల్ పెయింటింగ్స్ వేశారు.



డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్

సంతోషంగా ఉంది



లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్మాణ్ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉంది. సంస్థ ద్వారా క్లాస్ రూం, మోడల్ టాయిలెట్స్ నిర్మిస్తోంది. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.

–భీమయ్య, ప్రధానోపాధ్యాయులు, లింగంపల్లి ప్రభుత్వ పాఠశాల

కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదన

లింగంపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించడంతో పాటు ఒక టీచర్, ఆయాను నియమించాలనే ప్రతిపాదన ఉంది. ఎడ్యుకేషన్ వాల్ పెయింటింగ్స్ వేస్తాం. ప్రభుత్వ అధికారుల సహకారం, సీఎస్‌ఆర్ నిధులతో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

–మనోహర్, సీనియర్ మేనేజర్, నిర్మాణ్ ఆర్గనైజేషన్

కంటి వెలుగుకు సర్వం సిద్ధం

వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య

గచ్చిబౌలి: కంటి వెలుగు కార్యక్రమానికి సర్వం సిద్ధం చేశామని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ జె.శంకరయ్య పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు కంటి వెలుగు కేంద్రాలు ప్రారంభమవుతాయని, పరీక్షల కోసం వచ్చే వారికి అసౌకర్యం కల్గకుండా చర్యలు తీసుకోవాలని ఉప కమిషనర్లు, ఉప వైద్యాధికారులకు ఆయన సూచించారు. స్వయం సహాయక బృందాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలన్నారు. వెస్ట్ జోనల్ పరిధిలోని యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్సీపురం, పటాన్‌చెరు సర్కిళ్లలో 38 చోట్ల కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

కేంద్రాలివే....

యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలోని వెంకటగిరిలోని పీజేఆర్ కమ్యూనిటీహాల్, మధురానగర్ కమ్యూనిటీ హాల్, ఫాతిమానగర్ కమ్యూనిటీహాల్, కార్మికనగర్ కమ్యూనిటీ హాల్, బంజారానగర్ కమ్యూనిటీహాల్, శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని సిరికీ కమ్యూనిటీ హాల్, శేరిలింగంపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్, కొత్తగూడ కమ్యూనిటీ హాల్, సాగరసంఘం కమ్యూనిటీ హాల్, రాయదుర్గం వార్డు కార్యాలయం, చందానగర్ డివిజన్ పరిధిలోని అయ్యప్పసొసైటీ కల్చరల్ క్లబ్, మయూరీనగర్ కమ్యూనిటీ హాల్, జనప్రియనగర్ ఫేజ్–2 కమ్యూనిటీ హాల్, పీజేఆర్ స్టేడియం, ఆర్సీపురం–పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని ఎల్ఐజీ కమ్యూనిటీ హాల్, ఆర్సీపురం జీహెచ్‌ఎంసీ ఆఫీస్, కాకతీయనగర్ కమ్యూనిటీ హాల్, లయన్స్ క్లబ్ పటాన్‌చెరు, పీహెచ్‌సీ సబ్ సెంటర్ బండ్లగూడలో కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన జోనల్ కమిషనర్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీల్లో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్య బుధవారం పరిశీలించారు. ఏర్పాట్ల గురించి మెడికల్ ఆఫీసర్ శైలజను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వామి, సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ మాన్సి, ఏఈ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జోనల్ కమిషనర్ శంకరయ్య

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–22 పరిధిలో 18 ఏళ్లు పైబడిన వారందరు కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య సూచించారు. బుధవారం పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారత్ నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను ఆయన పరిశీలించారు. డివిజన్‌లో లయన్స్ క్లబ్, బండ్లగూడ లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం, రామచంద్రాపురంలో జీహెచ్‌ఎంసీ కార్యాలయం, మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్, కాకతీయ కమ్యూనిటీ హాల్, భారతినగర్ ఎల్ఐజీ కమ్యూనిటీ హాల్‌లో కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి
- మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హాట్‌స్పాట్లలో పర్యటన

హఫీజ్‌పేట్ : నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. బుధవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు చోరీలు జరుగుతున్న ప్రాంతాలలో సీసీఎస్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మియాపూర్ పరిధిలో చోరీలు జరగకుండా నివారించేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్రో స్టేషన్, కల్వరి టెంపుల్, న్యూకాలనీ, న్యూ హఫీజ్‌పేట్, సాయినగర్ కాలనీ, మయూరినగర్ ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించామన్నారు. ఈ పర్యటనలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, క్రైం ఏసీపీ శశాంక్ రెడ్డి, మియాపూర్ ఏసీపీ కృష్ణ ప్రసాద్, సీఐ తిరుపతిరావు, ఎస్ఐలు రవికుమార్, జగదీశ్వర్, యాదగిరిరావు, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

క్రీడల కేంద్రంగా మైత్రి మైదానం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పట్టణంలోని మైత్రి క్రీడా మైదానం భవిష్యత్‌లో క్రీడలకు కేంద్రంగా మారుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.7.50కోట్లతో మైత్రి క్రీడా మైదానాన్ని అత్యాధునిక వసతులతో ఆధునీకరించామని, ఏడాది పొడవునా క్రీడలు నిర్వహించేలా రూపొందిస్తున్నామన్నారు. త్వరలోనే మైత్రి క్రికెట్ క్లబ్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ఐదెకరాల విస్తీర్ణంలో మూడు మినీ స్టేడియాల నిర్మాణ పనులు చేస్తున్నామని, గ్రామీణ క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, వెంకట్ రెడ్డి, క్లబ్ కమిటీ ప్రతినిధులు, పుర ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమావేశం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్‌లు, కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గాంధీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌లు సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ డివిజన్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను అధికారులతో చర్చించారు. అత్యవసరంగా మార్చవలసిన విద్యుత్ లైన్లు, హైటెన్షన్ లైన్లు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల గురించి అధికారులకు వివరించారు.

ఉజ్జీవన్ బ్యాంకు ప్రారంభం

మాదాపూర్: ఉజ్జీవన్ చిన్న ఫైనాన్స్ బ్యాంక్ రూ.10 లక్షల నుండి రూ.10 కోట్ల వరకు వ్యాపార రుణాలను అందిస్తుందని ఉజ్జీవన్ చిన్న ఫైనాన్స్ బ్యాంక్ చైర్మన్ బి.ఎ.ప్రభాకర్ తెలిపారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదాపూర్, కూకట్‌పల్లి, ఏఎస్‌రావు నగర్, సికింద్రాబాద్ శాఖలను ప్రారంభించినట్లు తెలిపారు. రూ.5 లక్షల నుండి రూ.75 లక్షల వరకు ఇంటి రుణాలను అందిస్తుందన్నారు. వ్యక్తులు, వ్యాపారాలు, వ్యాపార విస్తరణ తదితరాలకు రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, ఫౌండర్ సమిత్‌ఘోష్, మేనేజింగ్ డైరెక్టర్ ఇతీరా దేవి ష్, డైరెక్టర్ రజనీమిశ్రా తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల పరిశీలన

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ హమీద్ పటేల్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీఎస్ షోరూం మొదటి వీధిలో సుమారు రూ.25 లక్షలతో అంతర్గత రోడ్ల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గఫూర్, అలీ, మహేందర్, కలీం, మక్బుల్, సయ్యద్ ఉస్మాన్, జానీ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న, కార్పొరేటర్ హమీద్ పటేల్

మనూ నూతన విద్యార్థి సంఘం



సంఘం అధ్యక్షుడు ఫైజాన్‌కు సర్టిఫికెట్‌ను అందిస్తున్న వీసీ ఐనులీహసన్

రాయదుర్గం: ఉర్దూ యూనివర్సిటీ వారసత్వాన్ని విద్యార్థి సంఘం నిలబెట్టాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనులీహసన్ సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2022–23 విద్యాసంవత్సరానికి కొత్తగా ఎన్నికైన విద్యార్థి సంఘం పదవీ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎండి ఫైజాన్, ఉపాధ్యక్షుడుగా మహ్మద్ మిస్బాజాఫర్, కార్యదర్శిగా ఫైజాన్ ఎక్బాల్, సంయుక్త కార్యదర్శిగా మారియా హిదాయత్, కోశాధికారిగా ఎండి ఖాసీమ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారికి ఎన్నికైన సర్టిఫికెట్లను వీసీ అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, చీఫ్ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ అబ్దుల్ అజీమ్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, పరిశీలకులు ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, ప్రొఫెసర్ ముస్తాక్ అహ్మద్ పటేల్ పాల్గొన్నారు.

ఖమ్మం సభతో గుణాత్మక మార్పు

పటాన్‌చెరు: ఖమ్మం సభ ద్వారా దేశ రాజకీయ వ్యవస్థలో గుణాత్మక మార్పు వస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఖమ్మంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన ఖమ్మం సభకు తరలి వెళ్లారు. దేశ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌ను స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అంజయ్య యాదవ్, మాణిక్ రెడ్డి, నరసింహ, రాజేష్, కృష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సభకు బయల్దేరిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో నాయకులు

మలేషియన్ టౌన్‌షిప్ ముఖద్వారం ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని మలేషియన్ టౌన్‌షిప్ ముఖద్వారం, రెస్టారెంట్, విశ్రాంతి గదులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ మలేషియన్ టౌన్‌షిప్ నివాసితులు రెస్టారెంట్, విశ్రాంతి గదులు ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు.

విద్యుత్ తీగల్లో గాలిపటం

తీసేందుకు యత్నించిన బాలుడు విద్యుదాఘాతంతో మృతి



జిన్నారం(పటాన్‌చెరు): గాలిపటం విద్యుత్ వైర్లలో చిక్కుకుంది. దానిని తీసేందుకు బాలుడు యత్నించటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా నందిగామకు చెందిన వీరబాబు–మానసాలమ్మ దంపతులు బొల్లారంలోని మల్లన్న బస్తీలో ఉంటున్నారు. వీరి కుమారుడు రిషి(12) స్థానిక ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. భవనంపైకి ఎక్కి గాలిపటం ఎగురవేస్తుండగా గాలి వాటుకు విద్యుత్ వైర్లలో చిక్కుకుంది. దానిని తీసే యత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. బాలుడి మృత దేహాన్ని వారి స్వగ్రామానికి తరలించేందుకు బీజేపీ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

పైప్‌లైన్ లీక్... నీటి వృథా

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీల కారణంగా మంచి నీరు వృథాగా పోతోంది. ఇంటింటా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తుంటే, అధికారుల నిర్లక్ష్యంతో నీరంతా వృథా అవుతోంది. నెల రోజులుగా అమీన్‌పూర్ త్రిపుర టీచర్స్ కాలనీ రోడ్డుపై పైప్ లైన్ లీకై నీరు పోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. లైన్‌మెన్‌కు సమస్యను తెలిపినా పరిష్కరించలేదని కాలనీవాసులు ఆరోపించారు. పైప్‌లైన్ లీకేజీతో నీరంతా రోడ్డుపై పారడంతో రోడ్డుపై గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అమీన్‌పూర్, చందానగర్ నుంచి బీరంగూడ టెంపుల్‌కు వెళ్లే దారి నిత్యం రద్దీగా ఉండడం, రోడ్డుపై నీరు పారుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ ఏఈ అమీరుద్దీన్‌ను వివరణ కోరగా.. సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

చిట్టీల మోసం కేసులో ..

- నలుగురికి ఏడాది జైలు, రూ.ఐదు వందల జరిమానా

పటాన్‌చెరు టౌన్: చిట్టీల పేరిట మోసం చేసిన కేసులో నలుగురికి ఏడాది జైలు శిక్ష, జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి శేఖర్ రెడ్డి తీర్పు ఇచ్చినట్లు సీఐ వేణు గోపాల్‌రెడ్డి, కోర్టు పీసీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2015 నవంబర్ 3వ తేదీన పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీకి చెందిన రామస్వామి, అతడి భార్య మణెమ్మతో పాటు బావమరిది యేసు, యేసు భార్య లీల చిట్టీ వ్యాపారులు. చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారు. దీంతో ముత్తంగి గ్రామానికి చెందిన సందీప్ గౌడ్ అప్పట్లో బాధితులతో కలసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్ఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం నలుగురు నిందితులను సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా కోర్టు పీపీ శ్రీనివాస్‌రెడ్డి వాదనలు విన్న న్యాయమూర్తి వారికి ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

వంద రోజుల పాటు కంటి పరీక్షలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో వంద రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహిస్తారని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల19 నుంచి వచ్చే నెల 17 వరకు అమీన్‌పూర్ పట్టణంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉచితంగా పరీక్షలు చేసి కంటి అద్దాలను అందిస్తారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.